సాక్షి
జగిత్యాల
బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



కొండపై పూజలు

కొండగట్టు : శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. అంజన్నకు పూజలు చేసి మొక్కులు చెల్లించారు.



ఎస్పీని కలిసిన జైలర్

జగిత్యాలజోన్: ఎస్పీ భాస్కర్‌ను జగిత్యాల స్పెషల్ సబ్ జైలర్ మొగిలేశ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.0/18.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉండి, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులపై దృష్టి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలజోన్: పదిహేనో ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన నిధులతో జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు చేపడతామని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. 2023–24లో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆమె జిల్లా కేంద్రంలో సమీక్షించారు. ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి శాశ్వతంగా ఉండే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామానుజాచారి, వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

కంటి వెలుగుపై ప్రచారం



పరీక్ష తీరు పరిశీలిస్తున్న ఆర్డీవో వినోద్‌కుమార్

మెట్‌పల్లి(కోరుట్ల): కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఇన్‌చార్జి ఆర్డీవో వినోద్‌కుమార్ సూచించారు. మున్సిపల్ 4, 14వార్డుల్లోని కంటి వెలుగు సెంటర్లను మంగళవారం ఆయన సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆటోల ద్వారా పథకం గురించి వార్డుల్లో ప్రచారం చేయాలన్నారు. వార్డు ఆఫీసర్లు ప్రతీఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి పరీక్షలు చేయించుకునేలా చూడాలని చెప్పారు. సెంటర్లకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ రాజ్‌కుమార్, డాక్టర్ సందీప్ తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

కోరుట్ల/రాయికల్(జగిత్యాల): వేములవాడలో ఈనెల 5న ఐటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే యూట్యూబ్‌తల్లి 'గూగులమ్మ బోనాలు బద్దిపోచమ్మకు' ప్రచార పోస్టర్‌ను మంగళవారం కోరుట్లలోని సాయిబాబా ఆలయంతోపాటు రాయికల్‌లో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు ఆవిష్కరించారు. యూట్యూబర్స్ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని యూట్యూబర్లు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు నటరాజ్, కొమురవెల్లి చిరంజీవి, మారంపల్లి సాయికిరణ్‌కుమార్, ఈదుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న మకరంద్

రాయికల్(జగిత్యాల): కుమ్మరిపల్లి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన మన ఊరు.. మన బడి పనులను అదనపు కలెక్టర్ మకరంద్ మంగళవారం పరిశీలించారు. అనంతరం పట్టణంలోని 12వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, డీఎంహెచ్‌వో శ్రీధర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, సర్పంచ్ చింతలపల్లి స్వప్న, ఎంపీటీసీ దొంతి నాగరాజు, ఉపసర్పంచ్ రాజు ఉన్నారు.

మెడికల్ సర్టిఫికెట్లు ఇవ్వండి

జగిత్యాల: వివిధ వ్యాధులతో బాధపడే ఉపాధ్యాయులకు జీవోఎంఎస్ నంబరు 5 ప్రకారం తక్షణమే మెడికల్ సర్టిఫికెట్లు జారీచేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్, అంబటి భూమేశ్వర్ కోరారు. ఈమేరకు మంగళవారం కలెక్టర్ రవిని కలిసి వినతిపత్రం అందజేశారు. క్యాన్సర్, టీబీ, కిడ్నీ, లివర్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతూ చికిత్స పొందుతున్నవారు బదిలీల ప్రక్రియకు అర్హులయ్యేలా మెడికల్ సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు. ఈ విషయంలో సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని వారు కోరారు. తద్వారా బాధితులకు న్యాయం జరుగుతుందని అన్నారు.

కుర్చీ కోసం పోటాపోటీ

- జోరుగా విందులు, వినోదాలు
- మొదలైన క్యాంపు రాజకీయాలు
- ఎవరు ఆహ్వానిస్తే వారివెంటే కౌన్సిలర్లు
- రసకందాయంలో జగిత్యాల బల్దియా రాజకీయం

జగిత్యాల: మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి నుంచి భోగ శ్రావణిని తప్పించాలని ప్రతినబూనిన సొంత పార్టీ బీఆర్‌ఎస్‌లోని కౌన్సిలర్లు ఎట్టకేలకు పంతం నెగ్గించుకున్నారు. ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు మూడు నెలల నుంచే ప్రణాళిక ప్రకారం ముందుకు సాగారు. అయితే, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ లక్ష్యంగా చేసుకుని భోగ శ్రావణి తన పదవికి రాజీనామా చేయడం జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే.



బండారు రజిని



సమిండ్ల వాణి



పల్లెపు రేణుక



అడువాల జ్యోతి

ఎమ్మెల్యేను టార్గెట్ చేయకుంటే..

- తన పదవికి రాజీనామా చేసిన భోగ శ్రావణి.. ఎమ్మెల్యే సంజయ్ లక్ష్యంగా తీవ్ర ఆరోపణలు చేయకుంటే అధిష్ఠానం ఆమెనే పదవిలో కొనసాగించే అవకాశం ఉండేదని సొంతపార్టీ శ్రేణులు చెబుతున్నాయి.
- కానీ, సంజయ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో ఆమెను ఆ పదవి నుంచి తప్పించాలని, లేనిపక్షంలో తామే మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని 27మంది కౌన్సిలర్లు హెచ్చరించారని తెలిసింది.
- ఇదే విషయాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది.
- ఎవరు బుజ్జగించినా తమ నిర్ణయంలో మార్పు ఉండబోదని కౌన్సిలర్లు స్పష్టం చేసినట్లు సమాచారం.
- ఇదే విషయాన్ని వారు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లగా ఆమె రాజీనామాకే అధిష్ఠానం మొగ్గుచూపినట్లు తెలిసింది.
- శ్రావణి నిర్ణయం తర్వాత కలెక్టర్.. వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు.
- తద్వారా తామే విజయం సాధించామని చెబుతూ అసంతృప్తి కౌన్సిలర్లు సోమవారం నుంచి సంబురాలు చేసుకుంటున్నారు.

అధిష్టానం నిర్ణయమే ఫైనల్

- శ్రావణి రాజీనామా ఆమోదం నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.
- చైర్‌పర్సన్ ఎన్నిక వరకూ ఆయన ఆ పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు.
- అయితే, ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల కాకముందే కుర్చీ కోసం పలువురు పోటీపడుతున్నారు.
- స్థానిక ఎమ్మెల్యే సూచించిన వారికే పదవి దక్కుతుందని, ఇందులో బీఆర్‌ఎస్ అధిష్ఠాన నిర్ణయమే ఫైనల్ అని అంటున్నారు.
- మరోవైపు.. ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ చాలాకాలం ఆ పదవిలో కొనసాగే అవకాశం ఉంది.
- కాగా, భోగ శ్రావణి చైర్‌పర్సన్ పదవికే రాజీనామా చేశారు. కౌన్సిలర్ పదకి రాజీనామా చేయలేదు.

ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరం

కుర్చీ దక్కించుకునేందుకు ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రధానంగా సమిండ్ల వాణి, బండారు రజిని, పద్మశాలీ వర్గానికి చెందిన అడువాల లక్ష్మణ్, పల్లెపు రేణుక చైర్‌పర్సన్ కుర్చీ ఆశిస్తున్నారు. కౌన్సిలర్ల మద్దతు కూడగట్టేందుకు ఒకరికి మించి మరొకరు విందులు, వినోదాలు ఇస్తున్నారు. ఇద్దరు కౌన్సిలర్లు ఏకంగా రిసార్ట్స్‌లో విందు ఏర్పాటు చేశారని, మంగళవారం నేరెళ్ల ప్రాంతంలోని సాంబశివగుట్టల్లో మరికొందరు విందు ఏర్పాటు చేశారని సమాచారం. అయితే, ఆశావహులు ఎవరు పిలిచినా కాదనకుండా పలువురు కౌన్సిలర్లు వారి వెంటే వెళ్తున్నారు. కానీ, ఎవరి మదిలో ఏమున్నదో ఎవరికీ తెలియడంలేదని చర్చ సాగుతోంది.

ఇన్‌చార్జినే కొనసాగిస్తారా..

- శ్రావణికి మద్దతుగా బీసీ సంఘాలు ప్రత్యక్ష ఆందోళనలు చేస్తున్నాయి. ప్రధానంగా పద్మశాలీ సేవా సంఘం భారీ సభ నిర్వహించి ఆమెకు మద్దతు ప్రకటించింది. శ్రావణికి అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం పదవి ఆశిస్తున్న వారిలో ఇద్దరు మున్నూరుకాపు, ఒకరు పద్మశాలీ, మరొకరు వడ్డెర సామాజిక వర్గానికి చెందినవారు ఉన్నారు. ఇందులో ఎవరికి పదవి ఇచ్చినా మళ్లీ వివాదం తలెత్తుతుందనే ఉద్దేశంతో అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోంది. ప్రత్యామ్నాయంగా కొద్దికాలంపాటు ఇన్‌చార్జినే కొనసాగించే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది.

చాలా సంతృప్తినిచ్చింది

- బదిలీపై వెళ్తున్న కలెక్టర్ రవి



రవి, కలెక్టర్

జగిత్యాల: జగిత్యాల జిల్లాలో విధులు నిర్వర్తించడం తనకు చాలా సంతృప్తినిచ్చిందని కలెక్టర్ రవి అన్నారు. మహబూబ్‌నగర్‌కు బదిలీ అయిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో దాదాపు మూడేళ్లపాటు పనిచేయడం, ఈసమయంలోనే సీఎం కేసీఆర్ కలెక్టరేట్ ప్రారంభించడం, మెడికల్ కాలేజీ ఏర్పాటు కావడం, ఆనందంగా ఉందని తెలిపారు. కరోనా సమయంలో అధికారులు సమన్వయంతో సేవలు అందించారని, బాధితులకు నాణ్యమైన వైద్యం సకాలంలో అందించారని గుర్తుచేశారు. కరోనా బాధితులను ఆస్పత్రులకు తరలించడంలో అన్ని విభాగాలు ఎంతో సామాజిక సేవ ప్రదర్శించాయని ప్రశంసించారు. సుమారు రెండేళ్లపాటు జిల్లావాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేయడం మర్చిపోలేనిదన్నారు. ధర్మపురి నృసింహస్వామి, కొండగట్టు ఆలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించామని, పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని అన్నారు. పలు సంక్షేమ పథకాలు ప్రజల దరిచేరేలా కృషి చేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేనివిధంగా జగిత్యాల నియోజకవర్గంలోనే 4,250 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించడం గొప్పవిషయమన్నారు. కోరుట్లలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణం, ధర్మపురిలో మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటు సంతృప్తి ఇచ్చిందని వివరించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారంతో జిల్లాను ప్రగతిపథంలో నడిపించామని అన్నారు.

ఇన్‌చార్జి కలెక్టర్‌గా కర్ణన్



ఆర్వీ కర్ణన్

జగిత్యాల జిల్లా కలెక్టర్ గుగులోతు రవి బదిలీ అయ్యారు. 2020 ఫిబ్రవరి 3న ఆయన జగిత్యాల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయనను మహబూబ్‌నగర్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. జగిత్యాలకు పూర్తిస్థాయి కలెక్టర్‌ను ఇంకా నియమించలేదు.

అవసరమైన వారికి శస్త్రచికిత్సలు



ధర్మపురిలోని కంటి వెలుగు శిబిరంలో వివరాలు సేకరిస్తున్న కలెక్టర్ రవి

- కలెక్టర్ రవి
- ధర్మపురిలో పర్యటన
- కంటి వెలుగు శిబిరం సందర్శన

బుగ్గారం(ధర్మపురి): ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అందరికీ పరీక్ష చేసి కళ్లద్దాలు అందించడంతోపాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తామని కలెక్టర్ రవి అన్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు ప్రత్యేక శిబిరాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. రోజువారీ పరీక్షల సంఖ్య పెంచాలని సూచించారు. కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, తహసీల్దార్ వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ రమేశ్, నాయకుడు సంగి శేఖర్ పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకారాదు..

పేదరికం చదువుకు అడ్డుగా మారకూడదని కలెక్టర్ రవి అన్నారు. ఫేస్‌బుక్ మిత్రుల సహకారంతో ధర్మపురిలోని పేద విద్యార్థులకు శుక్రవారం ఆయన 42 సైకిళ్లను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు రేణిగుంట రమేశ్.. దాతల నుంచి రూ.2లక్షలు సేకరించి వీటిని కొనుగోలు చేశారు. కలెక్టర్ చేతుల మీదుగా పేద విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రమేశ్ సేవలు అభినందనీయమన్నారు. తహసీల్దార్ వెంకటేశ్, ధర్మపురి ఆలయ ఈవో శ్రీనివాస్, ఎస్సై కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: ధరణి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ రవి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. మన ఊరు.. మన బడి పనులను వేగవంతంచేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు లత, మకరంద్, ఆర్డీవోలు మాధురి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతిలో మార్పులతోనే విపత్తులు



మాట్లాడుతున్న జాతీయ విపత్తు నిర్వహణ దళం కమాండర్ మన్మోహన్‌యాదవ్

- జాతీయ విపత్తు నిర్వహణ దళం కమాండర్ మన్మోహన్‌యాదవ్

మల్లాపూర్(కోరుట్ల): ప్రకృతిలో జరిగే మార్పులతోనే విపత్తులు సంభవిస్తాయని జాతీయ విపత్తు నిర్వహణ దళం కమాండర్ మన్మోహన్‌యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఎన్డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విపత్తుల నివారణ అవగాహన సమావేశంలో మాట్లాడారు. ప్రకృతిని రక్షిస్తేనే మానవాళికి మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. ప్రకృతిలో వచ్చే మార్పుల వల్ల విపత్తులు వచ్చి ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగిస్తాయన్నారు. అడవులను నిర్మూలించడం, కాలుష్యం పెరిగిపోవడం, జీవ వైవిధ్యం దెబ్బతినడం, వాతావరణం వేడెక్కడం వంటి మార్పులతోనే ప్రకృతిలో సమతుల్యత లోపించి విపత్తులు వస్తున్నాయని తెలిపారు. ప్రకృతిని అనుసరించాలని, శాసించకూడదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మన కార్యకలాపాలను కొనసాగిస్తేనే విపత్తులను నివారించవచ్చని సూచించారు. అనంతరం 15మంది ఎన్డీఆర్‌ఎఫ్ బృందంతో భూకంపం, వరదలు, అగ్నిప్రమాదాలు, పాముకాటు, అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడం వంటి విపత్తులను ఎదుర్కొనే వ్యూహాలను విద్యార్థులకు ప్రదర్శనల ద్వారా వివరించారు. హెచ్‌ఎం అనితకు సేఫ్టీ కిట్ అందజేశారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన ఆదిరెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంఈవో బీమయ్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి, ఎంపీటీసీలు ఆకుతోట రాజేశ్, మరిపెల్లి సత్తెమ్మ మల్లయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర చెల్లించండి



మాట్లాడుతున్న తిరుపతినాయక్

కథలాపూర్(వేములవాడ): పసుపు రైతులకు క్వింటాలుపై రూ.15 వేలు మద్దతు ధర చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రతినిధి తిరుపతినాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం వివిధ గ్రామాల్లో ఆయన పర్యటించి పసుపు రైతులతో మాట్లాడారు. ఎనిమిది నెలలు కష్టపడి సాగు చేస్తున్న పసుపు పంటకు ప్రభుత్వం మద్దతు ధర చెల్లించే విషయంలో నోరు మెదపకపోవడం దారుణమన్నారు. పసుపు పంట ఎకరం సాగుచేస్తే సుమారు రూ.1.50 లక్షల వరకు ఖర్చు అవుతోందని తెలిపారు. అయినా, దిగుబడి కనీసం 15 క్వింటాళ్లు రావడంలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయించాలని ఆయన కోరారు. రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

వెజ్, నాన్‌వెజ్ విక్రయాలు ఒకేచోట

- ఐదు బల్దియాల్లో సమీకృత మార్కెట్లు
- యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు
- ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు సన్నాహాలు

ధర్మపురి: జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఇకనుంచి వెజ్, నాన్‌వెజ్ విక్రయాలు ఒకేచోటకు రానున్నాయి. కమస్టమర్లకు సౌకర్యం కల్పించే దిశగా, వ్యాపారుల ఇబ్బందులు తొలగించేలా వీటిని నిర్మిస్తున్నారు. వచ్చే ఫిబ్రవరిలోనే ప్రారంభించేందుకు పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తున్నారు.


సిద్దిపేట, గజ్వేల్ తరహాలో..

- సిద్దిపేట, గజ్వేల్ తరహాలో ధర్మపురి పురపాలికలో సమీకృత మార్కెట్ నిర్మించేందుకు రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్ ఇటీవల శంకుస్థాపన చేశారు.
- చేపలు, మాంసం, కూరగాయలు, ఇతర శాఖాహారాలు ఒకోచోట లభించేలా దీనికి రూపకల్పన చేశారు.
- జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ బల్దియాల్లోనూ ఎమ్మెల్యేలు ఇదేతరహా మార్కెట్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

5 పురపాలికలు.. 568 గదులు..

- జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ బల్దియాల్లో సుమారు రూ.26.30 కోట్ల వ్యయంతో సమీకృత మార్కెట్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో దాదాపు 568 గదులు అందుబాటులోకి వస్తాయి. రాయికల్ మినహా మిగతాచోట్ల సుమారు 60శాతం వరకు పనులు పర్తయ్యాయి.

సమీకృత మార్కెట్ల స్వరూపం ఇలా..



ధర్మపురిలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్

ధర్మపురి : సమీకృత మార్కెట్ నిర్మాణానికి తొలుత రూ.2కోట్లు మంజూరయ్యాయి. ఇవి సరిపోలేదు. దీంతో మరో రూ.2కోట్లను మంత్రి కొప్పుల ఈశ్వర్ మంజూరు చేశారు. ప్రస్తుతం 65శాతం పనులు పూర్తయ్యాయి. 3 షెడ్లలో 94 గదులు నిర్మిస్తున్నారు. 80 గదులు కూరగాయలు, చేపలు, మాంసం కోసం 14 గదులు కేటాయిస్తారు.

- జగిత్యాల : రూ.6.50కోట్లు వెచ్చించి 100 గదులతో సమీకృత మార్కెట్ నిర్మిస్తున్నారు. కూరగాయల కోసం 52, చేపలు, మాంసం కోసం 30, పూలు, పండ్ల కోసం 18 గదులు నిర్మిస్తున్నారు. దాదాపు 70శాతం పనులు పూర్తయ్యాయి.
- కోరుట్ల : రూ.6.50కోట్ల వ్యయంతో 90 గదులతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టారు. కూరగాయల కోసం 48, చేపలు, మాంసం కో సం 28, పూలు, పండ్ల కోసం 18 గదులు కేటాయిస్తారు. 65శాతం నిర్మాణం పూర్తయ్యింది.
- మెట్‌పల్లి : రూ.6.30కోట్ల వ్యయంతో 138 గదులతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టారు. కూరగాయల కోసం 122, చేపలు, మాంసం కోసం 16 గదులు నిర్మిస్తున్నారు. పనులు చివరిదశకు చేరాయి.
- రాయికల్ : సమీకృత మార్కెట్ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేశారు. స్థలం అందుబాటులో ఉన్నా.. వివిధ కారణాలతో పనులు ప్రారంభించలేదు. ఇక్కడ 48 గదులు నిర్మిస్తారు. కూరగాయల కోసం 26, చేపలు, మాంసం కోసం 14, పూలు, పండ్ల విక్రయాలకు 8 గదులు నిర్మిస్తారు.

సమీకృత మార్కెట్ల వివరాలు	
మున్సిపాలిటీలు	5
మార్కెట్లు	5
వ్యయం(సుమారు రూ.కోట్లలో)	26.30
అందుబాటులోకి వచ్చే గదులు	568

మాకు ఎంతోఉపయోగం



ఐదేళ్ల నుంచి ఇక్కడే కూరగాయలు అమ్ముతున్న. మార్కెట్‌లేక ఇబ్బందులు పడ్డం. కొత్త మార్కెట్‌తో మాకు ఎంతోఉపయోగపడుతుంది.
– చంద్రవ్వ, వ్యాపారి, ధర్మపురి

రోడ్లపై విక్రయాలు



ఆరేళ్ల నుంచి రోడ్డు మీద కూరగాయలు, ఆకుకూరలు అమ్ముతున్న. మార్కెట్ లేక అనేక ఇబ్బందులు పడుతున్న. మా కష్టాలు తొలగించండి.
– అమృత, వ్యాపారి, ధర్మపురి

వేగవంతంగా పనులు

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో చేపట్టిన సమీకృత మార్కెట్ల నిర్మాణానికి దాదాపు రూ.26.30కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం 60శాతం వరకు పనులు పూర్తయ్యాయి. ఫిబ్రవరిలో ప్రారంభించే ఆలోచన చేస్తున్నాం.
– సంపత్‌రావు, ఈఈ, ప్రజారోగ్యశాఖ

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఉపాధ్యాయ సంఘ నాయకులు


ఎస్పీకి అభినందనలు తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

జగిత్యాల: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ భాస్కర్‌ను పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, బోయినిపల్లి ఆనందరావు, భూపతిరావు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆశ కార్యకర్త ఆత్మహత్య

రాయికల్(జగిత్యాల): మండలంలోని మూటపల్లి గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త అరికెల్లి లావణ్య (40) మంగళవారం అప్పుల బాధతో తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. లావణ్య తన కూతుళ్ల చదువుతో పాటు భర్త బుచ్చయ్యను దుబాయ్ పంపించేందుకు అప్పులు చేసింది. అవి తీర్చే దారి కనిపించకపోవడం, అప్పులు ఇచ్చిన వారి బాధలు భరించలేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. లావణ్యకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తల్లి రాజగంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రాజనర్సయ్య సేవలు చిరస్మరణీయం

బుగ్గారం(ధర్మపురి): ధర్మపురి పట్టణానికి చెందిన ప్రముఖ తెలుగు పండితుడు కోరుట్ల రాజనర్సయ్య(73) సేవలు చిరస్మరణీయమని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు అన్నారు. సోమవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందిన రాజనర్సయ్య భౌతికకాయాన్ని మంగళవారం పలువురు విశ్రాంత ఉద్యోగులు సందర్శించి నివాళులు అర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలో ప్రత్యేక సంతాపసభ ఏర్పాటు చేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీర్‌పూర్ ఎస్సైపై ఎస్పీకి ఫిర్యాదు

జగిత్యాలక్రైం: బీర్‌పూర్ ఎస్సైపై బీర్‌పూర్ మండలం కండ్లెపల్లికి చెందిన తొగిడి వెంకట్రాములు మంగళవారం ఎస్పీ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో భూ విషయంలో కోర్టులో విచారణ జరుగుతుండగా ఎస్సై తన కొడుకు శేఖర్‌ను, తనను దూషించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆరుతడి పంటలకు కోతుల బెడద

- జిల్లాలో ఏటా రూ.50 కోట్ల మేర పంట నష్టం
- పంటలను కాపాడుకునేందుకు రైతుల తంటాలు


పంటపై కోతుల గుంపు

జగిత్యాలఅగ్రికల్చర్: రైతన్నలు రాత్రిబవళ్లు కష్టపడి పంట పండించడం ఒక ఎత్తైతే, ఆ పంటను కోతుల బారి నుంచి కాపాడటం మరో ఎత్తుగా మారింది. జిల్లాలోని రైతాంగం వరితో పాటు ఆరుతడి పంటలైన మొక్కజొన్న, వేరుశెనగ, అలిసెంత, మినుము, పెసర పంటలను సాగు చేయగా.. ఆ పంటలు గింజ దశకు చేరుకోవడంతో కోతులు నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు తమ పనులు విడిచిపెట్టి కుక్కలు, కట్టెలు పట్టుకుని పంటకు కాపలా వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. లేదంటే కోతుల బెడదతో రైతులు తమ పంట చేలను బీళ్లుగా ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క జిల్లాలోనే ఏటా రూ.50 కోట్ల వరకు పంట నష్టం జరుగుతోంది.

ఆహారం కోసం పొలాల్లోకి..

కోతులకు సహజ ఆహారమైన కాయలు, పండ్లను అందించే చెట్లు భారీగా తగ్గడంతో రైతులు సాగు చేసే పంట పొలాల్లోకి వస్తున్నాయి. సాధారణంగా కోతులు తమ ఆహారం కోసం ప్రతిరోజూ 10–14 గంటల సమయం వెచ్చిస్తుంది. అడవులు తగ్గిపోవడం, ఉన్న అడవుల్లో పరిమిత ఆహారం, నీరు దొరకని స్థితి, కఠినమైన పరిస్థితుల వల్ల వాటి సంతతి అంతగా వృద్ధి చెందదు. జనావాసాల్లో, రైతుల పంట పొలాల్లో కోతులకు తేలిగ్గా ఆహారం దొరుకుతుంది. దీంతో వాటి సంతతి విపరీతంగా పెరుగుతోంది. జిల్లాలోనే పదేళ్లలో కనీసం ఐదు రేట్లు కోతులు తమ సంతతిని వృద్ధి చేశాయి. కోతులపై దైవభక్తితో ఆహారం అందిస్తుండటంతో జనావాసాలకు అలవాటుపడుతున్నాయి. కోతులను నియంత్రించేందుకు వాటిని పట్టుకుని కుటుంబనియంత్రణ చికిత్సలు చేస్తున్నప్పటికీ సరైన ఫలితాలు రావడం లేదు. కొందరు రైతులు వాటిని పట్టుకుని ఇతర ప్రాంతాల్లో వదిలిపెడితే, అవి అక్కడి నుంచి మళ్లీ గ్రామాల్లోకి, పంట పొలాలకు వస్తున్నాయి.

ఆరుతడి పంటలు వేయాలంటేనే భయం

జిల్లాలో వరి స్థానంలో పెసర, మొక్కజొన్న, వేరుశెనగ వంటి పంటలను దాదాపు లక్ష ఎకరాల్లో సాగు చేశారు. అయితే మొక్కజొన్న పంట గింజ దశ నుంచి కోతుల బెడద రైతులకు కునుకు లేకుండా చేస్తోంది. వేరుశెనగ పంట గింజలను తెంపే దశకు చేరుకోగానే కోతుల బెడద తీవ్రమైంది. జగిత్యాల జిల్లాలో ఎక్కువగా గుట్టలు ఉన్న ప్రాంతం కావడంతో మొక్కజొన్న, వేరుశెనగ పంటను వేయాలంటేనే ఇక్కడి రైతులు భయపడే పరిస్థితి నెలకొంది. వందలాది కోతులు మూడు నెలల పాటు పండించిన పంటను మూడు నిమిషాల్లో సర్వనాశనం చేస్తున్నాయి. దీంతో మొక్కజొన్న, వేరుశెనగ వేసిన రైతులు ఉదయం, సాయంత్రం కాపాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

కోతులను తరిమేందుకు తంటాలు

రైతులు చాలా గ్రామాల్లో కోతులను తరిమేందుకు సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకున్నారు. కొందరు కొండముచ్చులు పెంచడం, ఎలుగుబంట్ల వేషాల బొమ్మలు పెడుతున్నారు. దీనికి తోడు కొంతమంది రైతులు కుక్కలను సైతం పెంచుతున్నారు. ఒక జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌లోనే 20 వరకు కుక్కలను పెంచుతున్నారు. కుక్కలకు కోతులు కనబడగానే, వాటి వెంట పరుగెత్తి అరుస్తుండటంతో వెళ్లిపోతుంటాయి. మరికొంత మంది రైతులు సెల్‌ఫోన్లలో కుక్కల అరుపులను రికార్డు చేసి తోటలో చెట్లకు మైక్‌లు కట్టి కోతులను వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే మొక్కజొన్న తోటల చుట్టూ వలలు, చీరలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో కోతులు వచ్చినప్పుడు టపాకాయలు పేల్చినా వాటిని అదుపు చేయడం రైతులకు కష్టంగా మారుతోంది. పంటలను కోతుల బారి నుంచి కాపాడేలా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలని, ప్రభుత్వం ఆలోచనలు చేయాలని రైతులు కోరుతున్నారు.


కుక్కలను వెంట పెట్టుకుని పంటను కాపాడుకుంటున్న రైతు

పంట నాశనం చేస్తున్నాయి



ఎకరంలో వేరుశెనగ పంట వేశాను. నెల రోజుల నుంచి కోతులు రాకుండా రోజూ కాపలా ఉంటున్నాం. పంట గింజ దశకు చేరుకుంటుండటంతో ఒక్కరోజు కాపలా లేకపోతే పంటను నాశనం చేస్తున్నాయి.
– తీపిరెడ్డి శేఖర్, వేరుశెనగ రైతు

పంట చేతికి వచ్చే వరకు కష్టమే..



కోతులతో వేరుశెనగ పంట ధ్వంసం అవుతోంది. కుటుంబసభ్యుల్లో ఎవరో ఒక్కరం కాపాలా వెళ్లతున్నాం. మాపై దాడి చేస్తుండటంతో కుక్కలను వెంట తీసుకెళ్తున్నాం. పంట చేతికి వచ్చే వరకు కష్టంగానే ఉంది.
– రాంరెడ్డి, అలూరు, రాయికల్(మం)

నేటి నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ -4

- ప్రారంభించనున్న మంత్రి గంగుల కమలాకర్
- జూనియర్స్, సీనియర్స్ విభాగంలో మ్యాచ్‌లు

కరీంనగర్‌స్పోర్ట్స్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) సీజన్-4 ప్రారంభం కానుంది. తెలంగాణలోని ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జూనియర్, సీనియర్స్ కేటగిరీలలో క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో మ్యాచ్‌లు జరుగనుండగా, ఉదయం పోటీలను రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. కాగా ప్రతి రోజూ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు జరుగనున్నాయి. పోటీలకు హాజరయ్యే జట్లు ముందుగా నిర్వాహకులు సూచించిన షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలి. కరోనా దృష్ట్యా క్రీడాకారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ కోవిడ్ నిబంధనలు పాటించాలని నిర్వాహకులు తెలిపారు. కాగా ఎస్‌పీఎల్ సీజన్- 4కు సుధాకర్ పైప్స్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు.

నియమ నిబంధనలు..

- ఆయా కళాశాలల జట్లు తమ మ్యాచ్‌లు సూచించిన సమయానికి, మ్యాచ్ జరిగే తేదీన గంట ముందు నిర్వాహకులకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.
- మ్యాచ్ సమయంలో ఇరు జట్ల క్రీడాకారులు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు సంబంధించిన పదో తరగతి మార్కుల మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు చూపించాలి.
- క్రీడాకారులు సొంత కిట్‌ను వెంట తెచ్చుకోవాలి. మ్యాచ్‌లలో పాల్గొనే క్రీడాకారులు వైట్ డ్రెస్ తప్పనిసరిగా ధరించాలి. వైట్ డ్రెస్ లేనివారు మ్యాచ్‌లు ఆడేందుకు అనర్హులు.
- మ్యాచ్ జరిగే సమయంలో బ్యాట్స్‌మెన్, వికెట్ కీపర్ తప్పని సరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్‌గార్డ్స్, హ్యాండ్ గ్లోజ్స్ ధరించాలి.
- ఒక కళాశాల జట్టు తరుపున ఆడి మళ్లీ ఇతర కళాశాలకు ఆడరాదు. అలా ఆడితే ఆ కళాశాల జట్టును టోర్నమెంట్ నుంచి తొలగించడం జరుగుతుంది.
- ఎస్‌పీఎల్ సీజన్-4కు సంబంధించిన తుది నిర్ణయం నిర్వాహకులదే.

దొంగతనాలకు పాల్పడిన ముగ్గురి అరెస్టు


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ మొగిలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురిని మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ మొగిలి తెలిపారు. బొప్పాపూర్ శివారులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ట్రాలీ ఆటోలో సెంట్రింగ్ రేకులు తీసుకెళ్తున్న గంభీరావుపేట మండలం జగదాంబతండాకు చెందిన ఇద్దరు యువకులు, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన వ్యక్తిపై అనుమానం వచ్చి విచారించామని అన్నారు. ఆటోలో తీసుకెళ్తున్న రేకులను కామారెడ్డిలో అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడైందని తెలిపారు. ఈ మేరకు ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 3 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాలీ ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

అవినీతి కేసులో మాజీ ఉద్యోగికి నాలుగేళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: విధి నిర్వహణలో లంచం తీసుకుంటూ పట్టుబడిన ప్రభుత్వ ఉద్యోగికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.12 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పి.లక్ష్మీకుమారి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం.. ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామానికి చెందిన వేల్పుల వెంకన్న తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తిని విరాసత్ చేయాల్సిందిగా తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. జమాబంది నిమిత్తం బావుపేట గ్రామానికి చెందిన వీఆర్వో పొంరాజ్ మధుసూదన్‌రావును కలవాల్సిందిగా ఆయన సూచించారు. ఈక్రమంలో పట్టాదార్ పాస్‌బుక్ ఇచ్చిన వీఆర్వోను టైటిల్ డీడ్‌లు ఇవ్వాలని అడుగగా రూ.25,000 లంచం ఇస్తేనే టైటిల్ డీడ్ ఇస్తానని డిమాండ్ చేశాడు. దీంతో వెంకన్న ఏసీబీ అధికారులకు 2010 అక్టోబర్ 9 ఫిర్యాదు చేశాడు. నవంబర్ 1న తహసీల్దార్ ఆఫీసులో వెంకన్న నుంచి వీఆర్వో లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ జైపాల్ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. సీఐ రమణమూర్తి కేసు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కిషోర్ వాదించారు. న్యాయమూర్తి పి.లక్ష్మీకుమారి సాక్ష్యాధారాలు పరిశీలించి మధుసూదన్‌రావుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జైలు శిక్ష పడ్డ మధుసూదన్‌రావు ఉద్యోగ విరమణ పొందాడు.

ఫిర్యాదుదారుకు కోర్టు నోటీసులు

ఈ కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న వెంకన్న కోర్టుకు హాజరై నిందితుడికి అనుకూలంగా సాక్ష్యం ఇవ్వడంతో, 'నీ పై చర్యలు ఎందుకు తీసుకోరాదో కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలి' అని ఏసీబీ కోర్టు నోటీసులు జారీ చేసింది.

తండ్రి చితికి నిప్పంటించిన కూతురు


తండ్రి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కూతురు

బుగ్గారం(ధర్మపురి): తలకొరికి పెట్టాల్సిన కొడుకులు లేనందున కూతురే తన తండ్రికి కొడుకై తలకొరివి పెట్టిన సంఘటన ధర్మపురిలో విషాదం నింపింది. ధర్మపురికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కోరుట్ల రాజనర్సయ్య సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. రాజనర్సయ్యకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు స్వప్న మంగళవారం తండ్రి చితికి నిప్పంటించడంతో పలువురు కన్నీరుమున్నీరయ్యారు.

పరామర్శ

గుండెపోటుతో మృతి చెందిన రాజనర్సయ్య కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ మంగళవారం పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు సంగనభట్ల దినేశ్ తదితరులున్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి


రామకిష్టయ్య మృతదేహం


రాయమల్లమ్మ మృతదేహం

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో రైతు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. పోతుగల్‌కు చెందిన రైతు పేర్మని రామకిష్టయ్య(55) మంగళవారం పొలం పనులకు వెళ్లాడు. భార్య లీలవ్వ పొలంలో కలుపు తీస్తుండగా.. రామకిష్టయ్య వ్యవసాయ బావిలో నీళ్ల తగ్గాయో లేదో తెలుసుకునేందుకు వంగి చూశాడు. గట్టున కాలు జారి బావిలో ఉన్న సిమెంట్ గాజులపై పడ్డాడు. తలకు తీవ్ర గాయాలైన రామకిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. రామకిష్టయ్య కనిపించకపోవడంతో భార్య లీలవ్వ ఆయన కోసం వెతికింది. బావిలో భర్త మృతి చెంది ఉండడం గమనించి కన్నీరుమున్నీరై చుట్టుపక్కల రైతులను పిలిచింది. అప్పటి వరకు తమతో కలిసి పనిచేసిన భర్త నిర్జీవంగా కనిపించడంతో ఆమె రోధనలు మిన్నంటాయి. కుమార్తె, కుమారులు బాల్‌లక్ష్మి, దేవరాజు, శంకర్‌లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన పెంజర్ల రాయమల్లమ్మ (57) మంగళవారం విద్యుదాఘాతానికి గురై మరణించింది. స్థానికుల వివరాలు.. ఇంటి ఆవరణలో బావికి అమర్చిన విద్యుత్ మోటార్ వైరు ఊడిపోవడంతో విద్యుత్ సరఫరా అవుతున్న వైరుకు తాకగా, షాక్‌కు గురైన రాయమల్లమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త గతంలోనే మరణించగా బుద్ధిమాంద్యం గల కూతురు స్వరూప ఉంది.

ఖేలో ఇండియా కబడ్డీ పోటీలకు సాయిప్రియ


సాయిప్రియ

కరీంనగర్‌స్పోర్ట్స్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు జరుగనున్న ఖేలో ఇండియా కబడ్డీ పోటీలకు కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న జి.సాయిప్రియ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం సాయిప్రియ హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఖేలో ఇండియా జట్టు శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతుంది. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీధర్‌రావుతో పాటు అరుణ, స్వరూప, వెంకటరమణ, సతీష్‌కుమార్ అభినందించారు.

మానవత్వం చాటిన సీఐ


ఆసుపత్రిలో కుమారుడు లడ్డుతో తల్లి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులైన తల్లికుమారులకు తక్షణ సాయం అందించి మానవత్వం చాటుకున్నారు ఎల్లారెడ్డిపేట సీఐ మొగిలి. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా గంభీరావుపేటకు వెళ్తున్న సీఐ మార్గమధ్యలో సోమారిపేటకు చెందిన శిరీష తన కుమారుడు లడ్డుతో కలిసి తమ బంధువు ద్విచక్ర వాహనంపై వెళ్తోంది. కుక్క అడ్డుగా రావడంతో వారి వాహనం అదుపు తప్పి కింద పడిపోయారు. దీంతో శిరీష ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన సీఐ వెంటనే తన వాహనంలో వారిని ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మానవత్వంతో సకాలంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన సీఐకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఉరేసుకొని ఆత్మహత్య


రాజు(ఫైల్)

చందుర్తి(వేములవాడ): భార్య కాపురానికి రావడం లేదని యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందుర్తి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తికి చెందిన అత్తెన రాజు(45) వేములవాడ సబ్ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. భార్య శైలజ కొన్నేళ్లుగా కాపురానికి రావడం లేదు. ఈ విషయమై పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీ జరిగినా సమస్య పరిష్కారం కాలేదు.కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజు తమ ఆవేదన ఇతరులతో పంచుకోలేక మనస్థాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాలప్డాడు. మృతుడికి భార్య శైలజతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి అక్క రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి పోలీసులు తెలిపారు.

ఆముదాలపల్లిలో గీత కార్మికుడు..

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో మార్క తిరుపతి(58) అనే గీత కార్మికుడు అనారోగ్య బాధలు భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సుధాకర్ తెలిపారు. రెండేళ్ల క్రితం తిరుపతికి పక్షవాతం రావడంతో మందులు వాడుతున్నాడు. నయం కాకపోవడంతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పై కప్పునకు ఉరేసుకున్నాడు. కూలీ పనులకు వెళ్లిన భార్య భాగ్యలక్ష్మి ఇంటికి రాగా, ఇంట్లో తలుపులు వేసి గడియపెట్టి ఉంది. అనుమానంతో కిటికీలో నుంచి చూడడంతో దూలానికి వేలాడుతూ కనిపించాడు. చుట్టుపక్కల వారిని పిలిచి బలవంతంగా తలుపులు తెరిచి చూడగా మృతిచెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆర్థిక పరిస్థితులు బాగా లేక యువకుడు..

కరీంనగర్‌క్రైం: లివర్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడడంతో పాటు ఆర్థిక పరిస్థితులు బాగాలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుల వివరాలు.. జగిత్యాల జిల్లా మల్యాల గ్రామానికి చెందిన పోచంపల్లి అంజయ్య(36) కరీంనగర్‌లోని హైమద్‌పురలో ఒక రేకుల రూంలో ఉంటూ లాండ్రీషాప్ నడుపుకుంటున్నాడు. దీంతో పాటు ఆర్టీసీ వర్క్‌షాపులో వంట కూడా చేస్తుంటాడు. గతంలో విదేశాలకు పని నిమిత్తం వెళ్లినప్పుడు అప్పులు అయ్యాయి. లివర్‌కు సంబంధించిన వ్యాధితో రెండేళ్ల నుంచి బాధపడుతున్నాడు. మనోవేదన చెందిన అంజయ్య మంగళవారం రేకుల రూంలో ఉరేసుకొని మృతిచెందాడు. ఎంతకీ తలుపులు తీయకపోయేసరికి ఇంటి యజమాని వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. వెంటనే మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం చెప్పగా వారు కరీంనగర్‌కు చేరుకున్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాపర్ వైర్ దొంగిలించిన వ్యక్తికి జైలు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణంలోని సన్ ఇంజినీర్ షాపు నుంచి కాపర్ వైరు దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయస్థాన న్యాయమూర్తి మంగళవారం తీర్పును వెలువరించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్ కుమార్ తెలిపారు. సిరిసిల్లకు చెందిన కంచం వేణు గతేడాది జూలై 30న దాదాపు 10 కిలోల కాపర్‌వైరు దొంగిలించాడన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి కోర్టులో సాక్ష్యాలను నిరూపించడంతో న్యాయమూర్తి శిక్ష ఖరారు చేసినట్లు తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామశివారు ఎల్లమ్మ గుడి ప్రాంతంలో ఇసుక డంపు చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం తనిఖీలు చేపట్టి ఇసుక డంపులను సీజ్ చేసినట్లు ఎస్సై పి.లక్ష్మారెడ్డి తెలిపారు. దాదాపు 25 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపును సీజ్‌చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా జగ్గారెడ్డి


జగ్గారెడ్డి


గోపాల్‌రెడ్డి


మధుకర్‌రెడ్డి

కరీంనగర్: రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి విజ్ఞాన పరిషత్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెడ్డి సంఘం ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. గత పాలక వర్గంలోని తాజా మాజీ అధ్యక్షుడు మూల ప్రభాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి పోటీపడ్డారు. రెండు వర్గాలుగా రెండు ప్యానళ్లు ఏర్పడగా వారికి కేటాయించిన పదవుల కోసం 34 మంది పోటీపడ్డారని ఎన్నికల అధికారి పెండ్యాల కేశవరెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా జగ్గారెడ్డి 1,407 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. ఉపాధ్యక్షులుగా ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, కసిరెడ్డి రాణిరెడ్డి, గన్ను మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా దాసరి రాంరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ట్రెజరరీ కాసర్ల మధుకర్‌రెడ్డి, ఈసీ మెంబర్లుగా ఎనిమిది మంది గెలుపొందారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, దారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్వార్ తిప్పిన ఇద్దరిపై కేసు

గోదావరిఖని: రౌడీషీటర్ మంథని సుమన్ శవయాత్రలో తల్వార్ తిప్పిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు రమేష్‌బాబు, ప్రసాద్‌రావు తెలిపారు. పొడవాటి కత్తిని తిప్పుతూ రోడ్లపై వెళ్తున్న ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసిన స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఎండీ జాకీర్, రాంనగర్‌కు చెందిన మారంగుల రమేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. చట్టవ్యతిరేక కార్యకపాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు

చికిత్సపొందుతూ బాలిక మృతి

మంథని: మంథని మండలం పోతారంకు చెందిన వడ్లగ్లే నిత్య(14) గత నెల 22న పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ 30న రాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నిత్య మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. గత నెల 11 నుంచి 23 వరకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చింది. తిరిగి 23న వసతి గృహానికి వెళ్లాల్సి ఉండగా వెళ్లనని 22న తల్లితో గొడవపడింది. వెళ్లాలని తల్లి మందలించడంతో ఆ విషయాన్ని మనసులో పెట్టుకొని ఇంటి పక్కన గల బాతురూంలోకి వెళ్లి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మంథని ఆస్పత్రి తర్వాత హైదరాబాద్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

ఆర్‌వీఆర్ కంపెనీలో ప్రమాదం

- కార్మికుడికి తీవ్రగాయాలు


ప్రమాద దృశ్యం

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2 పరిధిలోని ఆర్‌వీఆర్ ప్రైవేట్ ఓబీ కంపెనీలో ప్రమాదం జరిగి కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం రాత్రిషిఫ్ట్‌లో ముందుగా వెళ్తున్న వోల్వో వాహనాన్ని వెనకాలే వెళ్తున్న వాహనం ఢీకొనడంతో రాకేష్ అనే డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రెండు వాహనాల మధ్య డ్రైవర్ ఇరుక్కోవడంతో కాలు మడమ భాగం వరకు కట్ అయ్యింది. తీవ్ర రక్తస్రావం కావడంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాలు భాగం మడమ వరకు తొలగించే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.